ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 అనంతపురం జిల్లా వార్తలు
శుక్రవారం 12 ఏప్రిల్ 2024

ఉష్ణోగ్రతలు	అనంతపురం
గరిష్ఠం కనిష్ఠం	40.0 26.0

రంజాన్ పరిమళం..!





రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈద్-ఉల్-ఫితర్‌ను పురస్కరించుకుని గురువారం మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. వేలాది మంది తరలిరావడంతో ప్రార్థనా స్థలాలు కిటకిటలాడాయి. పసివారు మొదలు వృద్ధుల వరకూ ఉదయం 9.30 గంటలకల్లా ఈద్గా మైదానాలకు చేరుకుని ప్రార్థనలు చేశారు. వేసవి తీవ్రత నేపథ్యంలో పలువురు గొడుగులను వెంట తెచ్చుకున్నారు. అనంతపురం నగరంలో ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ మజీద్, ఖురాన్‌లోని అంశాలను బోధించి, ప్రార్థనలు చేయించారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్ సహా పలువురు ముస్లిం ప్రముఖులు, మత పెద్దలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● హెచ్చెల్సీ కాలనీలోని ఈద్గా మైదానం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేపట్టారు. వక్ఫ్ బోర్డు మాజీ సభ్యుడు కేఎం షఫివుల్లాకు ఆయన నివాసంలో ముస్లింలు శుభాకాంక్షలు తెలిపారు. సప్తగిరి సర్కిల్‌లోని ఈద్గా మసీదు, పాతూరులోని జంగాలపల్లి మస్జిద్, పిల్లిగుండ్ల కాలనీలోని ఈద్గా మైదానంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ఈద్గా మైదానాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇళ్లకు చేరుకుని, నెల రోజుల ఉపవాస దీక్ష ముగిసిన సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు చేసుకున్నారు.

- అనంతపురం కల్చరల్

ఈద్గా మైదానంలో ముస్లింల ప్రార్థనలు, ఆధ్యాత్మిక సందేశమిస్తున్న ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ మజీద్

- కిటకిటలాడిన ఈద్గాలు, మసీదులు
- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు

● అనంతపురం డ్రైవర్స్ కాలనీ ఈద్గా మైదానం వద్ద ప్రార్థనల అనంతరం టీడీపీ ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, నాయకులు రాయల్ మురళి, జేఎల్ మురళీధర్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సీపీఐ జాఫర్ తదితరులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

● టీడీపీ అభ్యర్థులు.. కళ్యాణదుర్గంలో అమిలేని సురేంద్రబాబు, ఉరవకొండలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, తాడిపత్రిలో జేసీ అస్మిత్ రెడ్డి, గుంతకల్లులో గుమ్మనూరు జయరాం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ అభ్యర్థులు దగ్గుబాటి, అంబికా లక్ష్మీనారాయణ







కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సీపీఐ జాఫర్‌లు..



శుభాకాంక్షలు తెలుపుతున్న అల్‌మేవా నాయకుడు ఫక్రుద్దీన్





ఈద్గా మైదానంలో గొడుగుల నీడన ప్రార్థనలు



అలయ్ బలయ్ తెలుపుకుంటున్న చిన్నారులు



గుంతకల్లులో ..



కళ్యాణదుర్గంలో



తాడిపత్రిలో ..



ఉరవకొండలో..

అసమర్థుడు రంగయ్య

విరుచుకుపడ్డ కాపు రామచంద్రారెడ్డి



వీరశైవ లింగాయతల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కాపు రామచంద్రారెడ్డి

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 11: ఎంపీ తలారి రంగయ్య ఒక అసమర్థుడని, ఈ ఐదేళ్లలో కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేశాడో చెప్పాలని బీజేపీ నాయకుడు, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. పట్టణంలోని కరణం భవన్ కల్యాణమండపంలో గురువారం వీరశైవ లింగాయత్ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలి నేని సురేంద్రబాబు, కాపు రామచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ తలారి రంగయ్యపై కాపు విరుచుకుపడ్డారు. ఈ ఐదేళ్లలో కళ్యాణదుర్గం నియోజకవర్గానికి తలారి రంగయ్య ఏ ఒక్క రోజైనా వచ్చాడా, అభివృద్ధి ఇంచైనా చేశాడా అంటూ ఘాటు విమర్శలు గుప్పించారు. బీటీపీ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులకు నీరు రావాలన్నా అమిలినేని సురేంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరు ఆలోచించి అమిలినేనిని గెలిపించాలని కోరారు. జగన్‌రెడ్డి పాలనపై కూడా కాపు విమర్శలు గుప్పించారు.

చీనీ.. బతుకు పోరు..!



కాయలు లేని చీనీచెట్టు



తాడిపత్రి టౌన్, ఏప్రిల్ 11: చీనీ పంటకు ధర బాగుంది. కానీ సరైన దిగుబడులు లేవు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటడం దీనికి ప్రధాన కారణం. చీనీ పంటకు నీటి తడులే కీలకం. ఆ తరువాత ఎరువులు, చీడపీడల నివారణ ఖర్చులు ఉంటాయి. మంచి ధర ఉన్న సమయంలో దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తే.. రైతులు అప్పుల ఊబి నుంచి కాస్తయినా బయట పడతారు. కానీ ధరలు బాగా ఉన్నప్పుడు దిగుబడి తగ్గడం తమకు శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరుబావులు ఎండిపోవడంతో చీనీ చెట్లను బతికించుకునేందుకు రైతులు ట్యాంకర్లను బాడుగకు తెచ్చుకొని నీటి తడులను అందిస్తున్నారు. టీడీపీ హయాంలో చెరువులకు నీరు అందించారని, దీంతో వేసవిలోనూ బోరుబావుల్లో పుష్కలంగా నీరు వచ్చేదని రైతులు అంటున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక చెరువులను నింపడం మానేసిందని, దీంతో తమ బోరుబావులు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అడుగంటిన భూగర్భ జలాలు
- పాతాళంలోనూ నీటి తడి కరువు
- నిలువునా ఎండుతున్న తోటలు
- అద్దె ట్యాంకర్ల నీటితో రైతుల తంటాలు
- ధరలు ఉన్న సమయంలో చేతికిరాని పంట



నీరులేక ఎండిపోయిన చీనీచెట్లు

చీనీ.. అంటే తాడిపత్రి..

ఒకప్పుడు చీనీకాయలు కావాలంటే ప్రతి ఒక్కరూ తాడిపత్రి ప్రాంతం వైపు చూసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రకృతి పగబట్టడంతో తోటలు నిలువునా ఎండిపోతున్నాయి. తంటాలుపడి కాపాడుకున్నా.. సరైన దిగుబడి రావడం లేదు. తాడిపత్రి నియోజకవర్గంలోని తాడిపత్రి, యాడికి, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాలు, శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు, పుట్లూరు మండలాల్లో చీనీసాగు అత్యధికంగా ఉంది. తాడిపత్రి మండలంలో 1,158 ఎకరాలు, యాడికి 1,355 ఎకరాలు, పెద్దపప్పూరు 3,708 ఎకరాలు, యల్లనూరు 12,319 ఎకరాలు, పుట్లూరు 5,470 ఎకరాల్లో చీనీ సాగులో ఉంది. గత ఏడాది వర్షాలు లేక చీనీచెట్లు పలుచోట్ల ఎండిపోయాయి. మరికొన్నిచోట్ల దిగుబడి బాగా తగ్గిపోయింది. దీంతో చీనీరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

పాతాళానికి వెళ్లినా..



ఎనిమిది ఎకరాల్లో 15 ఏళ్లక్రితం చీనీ మొక్కలను నాటాను. నీరు లేకపోవడంతో నాలుగు ఎకరాల్లో చీనీచెట్లను వదిలేశాను. మిగిలిన చెట్లను బతికించుకునేందుకు అప్పులు చేసి మరీ 1500 అడుగుల మేర బోరు వేయించాను. చుక్కనీరు పడలేదు. వేసవికాల వచ్చిందంటే చాలు మాకు ఈ తిప్పలు తప్పడం లేదు. టీడీపీ ప్రభుత్వంలో చెరువులకు నీరు వదలడంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు వచ్చేది. ప్రస్తుతం చెరువులో నీరులేకపోవడంతో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయి.

- రాజేష్‌నాయుడు, కోమటికుంట్ల, పుట్లూరు మండలం

తంటాలు పడుతున్నా..



రెండు ఎకరాల్లో చీనీచెట్లను బతికించుకునేందుకు తంటాలు పడుతున్నాను. నీటితడులు అందించకపోతే ఆరేళ్లపాటు కాపాడుకున్న చెట్లు చేతికి అందకుండాపోతాయి. చేతిలో చిల్లిగవ్వ లేదు. అప్పు చేసి నీటిని అందించాల్సిందే. కుటుంబ పోషణే బరువుగా ఉంది. అలాంటిది చెట్లను ఎలా బతికించుకోవాలో అర్థం కావడం లేదు.

- నరసింహులు, చీనీరైతు, కోమటికుంట్ల, పుట్లూరు మండలం

చుక్కనీరు లేదు..

చీనీ ధర ప్రస్తుతం టన్ను ధర రూ.41 వేలకు పైగా పలుకుతోంది. ఇలాంటి సమయంలో దిగుబడి కాస్త ఎక్కువగా తీసుకుందామని ఆశించిన రైతులకు నీటి సమస్య కొరకరాని కొయ్యగా మారింది. అప్పులు చేసి మరీ బోర్లు వేయించినా చుక్కనీరు పడలేదు. దీంతో దిగుబడి సంగతి అటుంచి.. చెట్లు బతికితే చాలు అన్నట్లుగా పోరాడుతున్నారు. ట్యాంకర్లను అద్దెకు తెచ్చుకొని తోటలకు నీరు తోలుకుంటున్నారు. సాధారణంగా చీనీచెట్లకు నీరులేకపోయినా దాదాపు 15రోజులు వాడిపోకుండా ఉంటాయి. కానీ ఈ వేసవిలో తాడిపత్రి ప్రాంతంలో ఉష్ణోగ్రతలు జిల్లాలోనే అత్యధికంగా నమోదవుతున్నాయి. ఈ కారణంగా వారం రోజులు నీరు అందకపోతే చీనీచెట్లు ఏకంగా ఎండిపోతున్నాయి. ట్యాంకర్ల అద్దె భరించే స్తోమత లేని చిన్న, సన్నకారు రైతులు చీనీ చెట్లను ఎలా బతికించుకోవాలో అర్థంకాక విలవిలలాడుతున్నారు.

ఒక్క నీటి ట్యాంకర్ రూ.1000

చీనీ చెట్లను బతికించుకునేందుకు రైతులు సాహసం చేస్తున్నారు. ట్యాంకర్ నీటికి రూ.1000 చెల్లిస్తున్నారు. ఒక ట్యాంకర్ నీరు 15 చెట్లకు మాత్రమే సరిపోతోంది. దీంతో నీటితడుల ఖర్చు రైతుకు తడిసి మోపెడు అవుతోంది. ఒక్కో రైతు కనీసం నాలుగు ఎకరాల్లో చీనీ పంటను సాగుచేశారు. వేసవి తీవ్రత కారణంగా వారానికి ఒకసారైనా తడి అందించాల్సి ఉంటుంది. ఎకరం పరిధిలో ఉన్న చీనీ చెట్లకు నీటి ఖర్చు వారానికి రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు అవుతోంది. వర్షాలు పడేంతవరకు తమకు ఈ తిప్పలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉమ్మడి జిల్లాలో టాప్

చీనీసాగులో ఉమ్మడి జిల్లాలో తాడిపత్రి ప్రాంతం అగ్రస్థానంలో ఉంటుంది. కాయ పరిమాణం, నాణ్యత ఎక్కువగా ఉన్న కారణంగా ఈ ప్రాంతంలో సాగుచేసిన చీనీకాయలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. జిల్లాలోని చీనీ వ్యాపారులు మొదలు తోపుడుబండ్ల వ్యాపారుల వరకూ తాడిపత్రి చీనీ కాయలను కొనుగోలు చేయడానికి ఎక్కువగా వస్తుంటారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఎక్కువ మంది చీనీ పండ్ల రసాన్ని తాగేందుకు మొగ్గు చూపుతుంటారు. దీంతో ఈ సీజన్‌లో మంచి డిమాండ్, అందుకు తగ్గ ధర లభిస్తాయి. కానీ పంట దక్కని కారణంగా రైతులకు నష్టాలే మిగులుతున్నాయి.

ఒక్కసారి నాటితే..

చీనీ పంట దీర్ఘకాలం దిగుబడిని ఇస్తుంది. ఒక్కోసారి ఊహించని స్థాయిలో ధరల లభిస్తుంది. అప్పటిదాకా పడ్డ కష్టాలను మరిపిస్తుంది. అందుకే తాడిపత్రి ప్రాంతంలో రైతులు ఎక్కువగా చీనీసాగువైపు మొగ్గుచూపుతుంటారు. ఒక్కసారి పెట్టుబడి పెట్టి చీనీ మొక్కలను నాటి.. ఐదేళ్లపాటు నిర్వహణ చూసుకుంటే చాలు.. దిగుబడి 40 ఏళ్లపాటు వస్తుంది. వర్షాలు సమృద్ధిగా పడినప్పుడు దిగుబడి ఆశాజనకంగా ఉంటుంది. కానీ ఒక్కసారి ఏడాది వర్షాలు పడకపోయినా.. చెట్లను బతికించుకోవడం కష్టతరమౌతుంది.

తీరు మారలేదు..!

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు



వైసీపీ ఎన్నికల ప్రచారంలో ఫీల్డ్ అసిస్టెంట్ రమణారెడ్డి (వృత్తంలో..)

కణేకల్లు/శింగనమల, ఏప్రిల్ 11: ఎన్నికల నిబంధనలను ధిక్కరించి.. పలువురు వలంటీర్లు, ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు అధికార పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. అధికారులు పలువురిని విధుల నుంచి తొలగించినా ఏమాత్రం జంకు లేకుండా వైసీపీ అభ్యర్థులతో కలిసి ఇంటింటికీ వెళుతున్నారు. కరపత్రాలు పంచుతూ, స్టిక్కర్లు అతికిస్తూ స్వామి భక్తి చాటుకుంటున్నారు. కణేకల్లు మండలంలోని ఎన్ హనుమాపురం, తుంబిగనూరు గ్రామ వలంటీర్లు గురువారం ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ నాయకుడు మెట్టు విశ్వనాథరెడ్డితో కలిసి వలంటీర్లు నవీనగౌడ, బడిగె మహేంద్ర ప్రచారం చేశారు. హనుమాపురంలో గ్రామ వలంటీర్లు తిమ్మప్ప, లాలూస్వామి, ప్రసాద్, సిద్ధయ్య, ఆంజనేయులు, వినోద్, యానిమేటర్ లాలూస్వామి వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. శింగనమల మండలం చక్రాయపేట ఫీల్డ్ అసిస్టెంట్ రమణారెడ్డి గురువారం వైసీపీ అభ్యర్థి తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. వైసీపీ అభ్యర్థి వీరాంజినేయలుతో కలిసి పెరవలి, జూలాకాలువ, పెద్దజలాలపురం, కొరివిపల్లి, ఉల్లికల్లు గ్రామాల్లో రమణారెడ్డి ప్రచారంలో పాల్గొన్నాడు. ప్రచారంలో పాల్గొన్న కారణంగా వెస్టు నరసాపురం ఫీల్డ్ అసిస్టెంట్ పట్నం భాస్కర్, లోలూరు ఫీల్డ్ అసిస్టెంట్ అంజిల్‌రెడ్డి, ఆకులేడు ఫీల్డ్ అసిస్టెంట్ గంగాధర్ రెడ్డిని అధికారులు ఇప్పటికే విధుల నుంచి తొలగించారు. అయినా చాలామందిలో మార్పు కనిపించడం లేదు.



మెట్టు విశ్వనాథరెడ్డితో వలంటీర్లు

ఏ ముఖం పెట్టుకుని వచ్చారు..?

వైసీపీ అభ్యర్థిని నిలదీసిన దళితులు



జూలాకాలువలో ప్రచారం చేస్తున్న వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు

శింగనమల, ఏప్రిల్ 11: 'మా కాలనీ వ్యక్తి నుంచి డీలర్‌షిప్ లాగేసుకున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీని తొలగించి.. వేరే వర్గాలకు ఇచ్చారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడిగేందుకు వచ్చారు..?' అని జూలాకాలవ ఎస్సీ కాలనీవాసులు వైసీపీ శింగనమల నియోజకర్గ అభ్యర్థి వీరాంజనేయులును నిలదీశారు. గ్రామానికి గురువారం వెళ్లిన వైసీపీ అభ్యర్థి.. ఎస్సీ కాలనీలోకి వెళ్లగానే అక్కడి దళితులు చుట్టుముట్టారు. తమ కాలనీపట్ల ఎమ్మెల్యే పద్మావతి, ఆమె భర్త సాంబశివారెడ్డి, అతని చిన్నాన శ్రీరామిరెడ్డి కక్షపూరితంగా వ్యవహరించారని మండిపడ్డారు. తమ కాలనీ వ్యక్తికి ఉన్న డీలర్‌షిప్‌ను, పాఠశాలలో మధ్నాహ్న భోజనం ఏజెన్సీని తొలగించి.. మరో సామాజికవర్గానికి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అన్యాయం గురించి ఎన్నిసార్లు అడిగినా ఎవరైనా పట్టించుకున్నారా అని వీరాంజనేయులును నిలదీశారు. తమ కాలనీలో ప్రచారం చేయాల్సిన అవసరం లేదని అడ్డుకున్నారు. దీంతో ఆయన మరో కాలనీకి వెళ్లిపోయారు.

పూలే ఆశయ సాధనకు కృషి

కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 11: మహాత్మ జ్యోతిబా పూలే 198వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో పూలే చిత్ర పటానికి కలెక్టర్ వినోద్‌కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మినీ కాన్ఫరెన్స్ హాలులో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, జడ్పీ సీఈఓ వైఖేమ్ నిదియాదేవి, డీఆర్వో రామకృష్ణారెడ్డి తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జ్యోతిబా పూలే బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతిగా చరిత్రలో కీర్తికెక్కారని అన్నారు. ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని పిలుపునిచ్చారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన, మహిళోద్ధారణ, విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. మహిళలు అందరూ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. బీసీ వెల్ఫేర్, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమ శాఖ తరఫున మహిళల అభివృద్ధికి అవసరమైన అన్నిరకాల కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. ఆ దిశగా అధికారులంతా కలిసికట్టుగా పని చేయాలని అన్నారు. మహిళలు, బాలికల అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాష్ట్ర జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకోవాలని సూచించారు. జ్యోతిబా పూలే ఆశయాల సాధనకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ కొర్రారి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన్‌రావు, ఏఎస్డీ ఆనంద్, డీపీఓ ప్రభాకర్‌రావు, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్

నేత్రపర్వంగా లంకాదహనం


ఒంటె వాహనంపై స్వామివారు

గుంతకల్లు, ఏప్రిల్ 11: కసాపురం దేవస్థానంలో గురువారం రాత్రి లంకాదహన కార్యక్రమాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉగాది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా స్వామివారికి వేకువనే అభిషేకాలు, అలంకారాలు చేశారు. అర్చనలు, పూజలు నిర్వహించి మధ్యాహ్నం మహా మంగళహారతిని ఇచ్చారు. సాయంత్రం స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ఒంటె వాహనంపై ఆశీనులనుగావించి అలంకారాలు చేశారు. ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి దక్షిణ గోపురం ఎదుట బయలు ప్రదేశంలో బాణా సంచాను పేల్చి లంకాదహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భద్రాజీ, ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కే సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున, ప్రధాన అర్చకులు గరుడాచార్యులు, అనంతాచార్యులు, రాఘవాచార్యులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

మురడిలో ఘనంగా రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 11: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మురడి ఆంజనేయస్వామి రథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ప్రతి ఏటా ఉగాది పండుగ సందర్భంగా రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. రథోత్సవం సందర్భంగా ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతసేవతో స్వామివారికి పంచామృతాభిషేకం, వెండి కవచ స్వర్ణాభరకవచ, ఆకు పూజ, పవనామ మన్యు సూక్తం, రామా తారకహోమాలు తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంకాలం ఉత్సవమూర్తిని ఆలయం నుంచి అర్చకులు రథోత్సవం వద్దకు తీసుకువచ్చి రథోత్సవంలో ఉంచి ప్రోక్షణ బలిహరణ పూజలు నిర్వహించారు. భారీ భక్తజన సందోహం నడుమ రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంజూరుకాని డైట్ బిల్లులు

- పేద విద్యార్థుల పొట్టకొట్టిన వైసీపీ ప్రభుత్వం
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వార్డెన్లు
- ఏడు నెలలుగా అందని బిల్లులు
- రూ.40 కోట్ల బకాయిలు
- విద్యార్థులకు తప్పని ఆకలికేకలు


బీసీ సంక్షేమశాఖ కార్యాలయం

అనంతపురం ప్రెస్‌క్లబ్

పేద విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం.. వారి విద్యాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాం... వారికోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తాం... మీరు చేయవలసిందిల్లా ఒక్కటే.. మీ పిల్లలను సంక్షేమ వసతిగృహాల్లో చేర్పించండి.. అంతా మా ప్రభుత్వమే చూసుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆ పార్టీ ప్రజాప్రతినిధులు గొప్పలు పోయారు. క్షేత్రస్థాయిలోకి వచ్చేసరికి ఆ మాటలు ఒట్టి నీటిమూటలుగా మిగిలాయనడంలో ఎలాంటి సందేహం లేదు. పేద విద్యార్థులకు సకాలంలో అందించాల్సిన భోజనం విషయంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించింది. సకాలంలో డైట్ బిల్లులు విడుదల చేయకపోవడంతో ఐదేళ్లుగా విద్యార్థులకు ఆకలి కేకలు మిగిలాయి. రకరకాల సాకులతో ఐదేళ్లగా బిల్లులు పెండింగ్‌లో ఉంచడం... ఒకటి రెండు విడుదల చేయడం... నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లో ఉంచడంతో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందనే చెప్పాలి. దీనికితోడు మెనూ చార్జీలు పెంచినట్లు బూచి చూపి మెనూలో అదనపు పదార్థాలను చేర్చడం, సకాలంలో బిల్లులు మంజూరుకాక... వార్డెన్లపై ఆర్థికభారం వేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఏడు నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్ ఉండటంతో వార్డెన్లు అప్పులు చేసి మెనూ అమలు చేయాల్సిన దుస్థితిని నెలకొంది.

గోరంత పెంపు... అమలు అంతంతే..

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2023 సంవత్సరంలో డైట్ బిల్లులను కొద్దిమేర పెంచింది. విద్యార్థికి రూ. 150 నుంచి రూ. 200లు వరకే పెంచింది. పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో విద్యార్థులకు కేవలం రూ. 200లు పెంచి ఇడ్లీలు, పూరీలు, చికెన్ బిర్యానీ, పాలు, రకరకాల స్వీట్లు పెట్టాలని కొత్త మెనూ చేయడంతో ఆయా హాస్టల్స్ వార్డెన్లు ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ. 40 కోట్ల వరకు పెండింగ్

ఉమ్మడి అనంత జిల్లావ్యాప్తంగా సంక్షేమ వసతిగృహాలకు సంబంధించి దాదాపు ఏడు నెలలుగా డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 40 కోట్ల వరకూ డైట్ బిల్లులు మంజూరు కావాల్సి ఉందని ఆయా సంక్షేమ వసతిగృహాల అధికారుల ద్వారా అందిన సమాచారం. అనంత జిల్లాలో 58 బీసీ హాస్టళ్లు ఉండగా 7329 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం డివిజన్లకు జనవరి నెల నుంచి డైట్ బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. తాడిపత్రి డివిజన్‌లో అయితే రకరకాల సాంకేతిక కారణాల వల్ల అక్టోబరు నుంచి బిల్లులు రావాల్సి ఉంది. మొత్తం జిల్లా అంతా కలిపి రూ.10 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. శ్రీసత్యసాయి జిల్లాలో 59 బీసీ హాస్టళ్లు ఉండగా... 5849 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇక్కడ కూడా కొన్నిచోట్ల సెప్టెంబరు, అక్టోబరు నుంచి బిల్లులు రావాల్సి ఉంది. ఇక్కడ కూడా రూ. 11 కోట్ల వరకూ పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక లెక్కలు చూపుతున్నాయి. అనంతపురం జిల్లాలో 58 ఎస్సీ హాస్టళ్లు ఉండగా 4927 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇక్కడ అక్టోబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్నింటికి మాత్రమే బడ్జెట్ రిలీజ్ చేయడం... మరికొన్నింటిని పెండింగ్‌లో ఉంచడంతో దాదాపు ఏడు నెలలుగా రూ. 8 కోట్ల వరకు బిల్లులు అందని పరిస్థితి ఉంది. శ్రీ సత్యసాయి జిల్లాలో 27 ఎస్సీ హాస్టళ్లు ఉండగా 1806 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇక్కడ వీరి పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. ఆరేడు హాస్టళ్లకు జూన్ నెల నుంచి బిల్లులు పడాల్సి ఉండగా మరికొన్ని చోట్ల జూలై నుంచి అంటే దాదాపు నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. అన్ని కలిపితే దాదా పు రూ. 9 కోట్ల వరకూ పెండింగ్‌లో ఉన్నట్లు తె లుస్తోంది. ఇక గిరిజన సంక్షేమశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖలకు సంబంధించిన హా స్టళ్లకు సంబంధిం చి మరో రూ. 3 కోట్ల వరకూ బి ల్లులు పెండింగ్‌లో ఉన్న ట్లు అధికారులు పే ర్కొంటున్నారు.

- తాడిపత్రి డివిజన్‌లోని ఓ ఎస్సీ వార్డెన్ అక్టోబరు నుంచి అప్పులు తెచ్చి డైట్ అమలు చేస్తున్నాడు. ఇప్పటి వరకు దాదాపు రూ. 10 లక్షలు అప్పు చేసినట్లు చెప్పుకొచ్చాడు. ఈ నెల బిల్లులు రాకపోతే ఉద్యోగం వదిలేయాలనుకుంటున్నానని తెలిపారు.
- కళ్యాణదుర్గం డివిజన్‌లో ఓ బీసీ వార్డెన్ నాలుగు నెలలుగా అప్పు తెచ్చి మెనూ అమలు చేస్తున్నాడు. రూ. 6 లక్షలు అప్పు తెచ్చి విద్యార్థులకు మెనూ అమలు చేశాడు. ఈ నెల ముగిస్తే.. వచ్చే నెల ఎన్నికలు... తరువాత పరిస్థితి ఏంటో అర్థం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.
- ధర్మవరం డివిజన్‌లో ఓ బీసీ వార్డెన్ ఐదు నెలలుగా డైట్ బిల్లులు రాకపోవడంతో అప్పు తెచ్చి మెనూ అమలు చేస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. దాదాపు రూ. 7 లక్షలు అప్పు చేసినట్లు తెలిపారు. ఈ నెలకు సంబంధించి డబ్బులు లేకపోవడంతో తన భార్య నక్లెస్ బ్యాంకులో లోన్ పెట్టి రూ.80 వేలు తెచ్చుకున్నానని, ఆ డబ్బుతో పిల్లలకు మెనూ అమలు చేస్తానన్నాడు.



సంక్షేమ హాస్టళ్లను నిర్వీర్యం చేసేశారు

విద్యార్థులకందించే భోజనం విషయంలో ప్రభుత్వం వివక్షత చూపడం బాధాకరం. డైట్ బిల్లులు సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటించారు. ఈ పాపం ఊరికే పోదు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు ప్రజలు సరైన బుద్ధి చెప్తారు.

-సాకే నరేష్, బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు



విద్యార్థుల పాలిట కంసమామగా మారిన జగన్

డైట్ బిల్లులు విడుదల చేయకపోవడంతో వార్డెన్లు అప్పులు తెచ్చి మెనూ అమలు చేస్తున్నారు. బిల్లులు విడదల చేయాలని పోరాటాలు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు. విద్యార్థుల పాలిట జగన్ కంసమామగా మారిపోయాడు. త్వరలో జరిగే ఎన్నికల్లో అందరూ ఏకతాటిపైకి వచ్చి జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలి.

-కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు

గోరంట్ల, ఏప్రిల్ 11: మండలంలోని గౌనివారిపల్లిలో టీడీపీకి చెందిన దళిత దంపతులు లక్ష్మీనర్సప్ప, నాగమణిపై జరిగిన దాడికి సంబంధించి నలుగురు వైసీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును గురువారం నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా గ్రామస్థులు పార్వేట ఉత్సవం నిర్వహిస్తుండగా కుందేలు పెట్టెను తాకినందుకు దళితుడైన లక్ష్మీనర్సప్పతో వైసీపీ నాయకులు ఘర్షణ పడి దాడి చేసిన విషయం తెలిసిందే. గాయపడిన లక్ష్మీనర్సప్ప హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తనను కులం పేరుతో దూషించి, కట్టెలు, ఇటుక పెళ్లలతో దాడిచేసినట్లు అయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో డీలర్ నారాయణ, వలంటీర్ హరిక్రిష్ణ, సాయిక్రిష్ణ, రామచంద్రపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉప సర్పంచ్ రాజారెడ్డిపై...

గోరంట్ల మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ రాజారెడ్డిపై పంచాయతీ దళిత ఉద్యోగి వినోద్‌ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు గురువారం నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. గోరంట్లలోని రెడ్డివారివీధిలో వీధి లైటు ఏర్పాటు చేసే విషయమై ఎలక్ట్రీషియన్ వినోద్‌ను ఉప సర్పంచ్ రాజారెడ్డి దుర్భాలాడిన విషయం తెలిసిందే. దీనిపై పంచాయతీ కార్మికులు. దళిత సంఘం నాయకులు గురువారం పోలీస్‌స్టేషన్, పంచాయతీ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. వినోద్‌ను కులంపేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదు చేయడంతో ఉప సర్పంచ్ రాజారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అరాచక శక్తులను ప్రకాష్‌రెడ్డి పెంచి పోషిస్తున్నారు

- రాప్తాడు ఎమ్మెల్యేపై మాజీ మంత్రి పరిటాల సునీత ఫైర్
- బండి రవి దాడిలో గాయపడ్డవారికి పరామర్శ


టీడీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న పరిటాల సునీత

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11: అరాచకశక్తులను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పెంచి పోషిస్తున్నారని మాజీ మంత్రి పరిటాల సునీత మండిపడ్డారు. వైసీపీ గూండా బండిరవి దాడితో తీవ్రంగా గాడపడి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త శివయాదవ్‌తోపాటు మరో కార్యకర్తను పరిటాల సునీత గురువారం రాత్రి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాప్తాడు జరిగిన వైసీపీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ అల్లరి మూక బండిరవికి మొన్నటి వరకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రక్షణ ఇచ్చాడన్నారు. బెయిల్‌పై వచ్చాక సొంత గ్రామానికి పంపగా మరోసారి తన క్రూరత్వాన్ని బయటపెట్టాడన్నారు. కనగానపల్లి మండలం కోనాపురంలో టీడీపీ కార్యకర్తలపై అకారణంగా దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసీపీ అరాచకాలు ఇంకా తగ్గలేదన్నారు. ఫోటోగ్రాఫర్‌పై దాడి చేసిన రౌడీని బయటికి వదిలి టీడీపీ కార్యకర్తలపై ఇలా దాడులు చేయిస్తారా అని మండిపడ్డారు. ఈ ఘటనపై ప్రకాష్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ కార్యకర్తల జోలికివస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఇలాంటి దాడులు జరుగుతున్నా పోలీసులు, ఎన్నికల అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన వైసీపీ గూండాపై తక్షణమే చర్యలు తీసుకోకపోతే కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో మృతి


లాల్‌బాషా

కణేకల్లు, ఏప్రిల్ 11: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందాడు. మండలంలోని సొల్లాపురం గ్రామానికి చెందిన దూదేకుల లాల్‌బాషా(30) గురువారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. రంజాన్ సందర్భంగా సాయంత్రం మసీదుకు ప్రార్థన నిమిత్తం వెళ్లాడు. కాళ్లు, చేతులు కడుక్కుని పక్కనే ఉన్న విద్యుత్‌వైర్‌ను పొరపాటున తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

చీనీ కాయలు టన్ను రూ.38వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 11: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.38వేలు, కనిష్ఠంగా రూ.15,500లు, సరాసరి రూ.22వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 219టన్నులు వచ్చాయన్నారు.

మూగజీవికి నీటి కష్టం

- మురుగునీటిని తాపుతున్న కాపరులు
- చెరువు నీటిని వదిలి ఆదుకోవాలని వినతి
- శింగనమల మండలంలో దారుణ పరిస్థితులు

శింగనమల ఏప్రిల్ 11: మండు వేసవిలో గుక్కెడు నీరు దొరక్క మూగ జీవాలు అల్లాడి పోతున్నాయి. అడవికి మేతకు వెళ్లే పశువులు, గొర్రెలు నీరు దొరక్క.. అక్కడక్కడ కనిపించే మురుగు నీటిని తాగుతున్నాయి. శింగనమల చెరువు పరిసర ప్రాంతాల్లోని పది గ్రామాలలో లక్షకు పైగా మూగ జీవాలు ఉన్నాయి. చెరువు నీటిని అప్పుడప్పుడు కాలువకు వదిలితే పశువులు, గొర్రెలకు తాగునీటి సమస్య ఉండదు. నీటిని వదలాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గొర్రెల కాపరులు వాపోతున్నారు. శింగనమల చెరువు నీటిని అనుమతి లేకుండా అనంతపురం-తాడిపత్రి హైవే పనులకు వాడుకున్నారు. ఏకంగా 37 కి.మీ. హైవే పనులకు ఓ ప్రజాపతినిధి భర్త చెరువు నీటిని తరలించారు. అధికార పార్టీవారి అక్రమ సంపాదనకు నీటిని వాడుకుంటున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. మూగజీవాల దాహార్తిని తీర్చమంటే అధికారులు స్పందిచకపోవడం దారుణమని అంటున్నారు.

లక్షకుపైగా జీవాలు

శింగనమల మండలంలో తీవ్ర వర్షాభావం కారణంగా గత ఏడాది పంటల సాగు తగ్గిపోయింది. దీంతో లక్షలాది మూగజీవాలకు మేత కొరత ఏర్పడింది. వేసవి కావడంతో ఎక్కడా పచ్చిక లేదు. ఎండు మోదులనే తింటూ జీవాలు ప్రాణలను నిలుపుకుంటున్నాయి. కొందరు గొర్రెల కాపరులు రూ.లక్షలు ఖర్చు చేసి మేత కొంటున్నారు. వేసవిలో కుంటలు, గుంతల్లో నీటిని జీవాలకు తాపేవారు. కొన్నిచోట్ల రైతులు వ్యవసాయ బోరు బావుల నీటిని ఇచ్చేవారు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటలను సాగు చేయలేదు. శింగనమల చెరువులో నీరుంది. ఈ నీటిని మూగ జీవాల అవసరాలకు కొంత వదలాలని వారం క్రితం అధికారులకు గొర్రెల కాపరులు వినతిపత్రం సమర్పించారు. అయినా అధికారులు స్పందించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.


మురుగునీటిని తాగుతున్న గొర్రెలు


ఉదయం 10గంటలకే నీడలో ఉన్న గొర్రెలు, మేకలు



మురుగు నీరే గతి..

నేను 30 సంవత్సరాల నుంచి గొర్రెల మందపై ఆధారపడ్డారు. అప్పుడప్పుడు మేత కొరత వచ్చేది. కానీ మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది నీరు కూడా లేదు. జీవాల దాహం తీర్చేందుకు ఇబ్బంది పడుతున్నాము. కాలువలో ఉన్న మురుగు నీటిని తాగుతున్నాయి. ఈ పరిస్థితిని చూస్తే బాధ కలుగుతోంది. మా కష్టాల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు.

- చిరంజీవి, గొర్రెల కాపరి, శింగనమల



పట్టించుకోవడం లేదు

మా చెరువులో నీటిని రోడ్డు పనులకు అమ్ముకున్నారు. మూగజీవాలకు మాత్రం చుక్క నీరు వదలడం లేదు. కాలువలో బురద నీరు, మురుగునీటిని తాపుతున్నాము. వారం క్రితం అధికారులను కలిసి సమస్యను వివరించాము. 15 రోజులకు ఒకసారి చెరువు నీటిని కాలువలకు వదిలితే జీవాలకు నీటి సమస్య ఉండదని విన్నవించాము. అధికారుల నుంచి స్పందన రాలేదు. ప్రజా ప్రతినిధులకు నీటిని అమ్ముకోవడం పట్ల ఉన్న ఆసక్తి.. మూగ జీవాల దాహార్తిని తీర్చడంపట్ల లేదు.

- లక్ష్మీపతి, గొర్రెల కాపరి, శింగనమల



ఎక్కడా చుక్క నీరు లేదు..

మూగజీవాలు తాగడానికి ఎక్కడా చుక్క నీరు లేదు. ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రోజుకు కనీసం రెండుసార్లు గొర్రెలకు నీరు తాపాలి. దిక్కుతోచక మురుగునీటిని తాపిస్తున్నాము. దీంతో జీవాలు అనారోగ్యానికి గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కాలువలకు నీరు వదలాలి.

- చలమయ్య, గొర్రెల కాపరి, శింగనమల

ద్విచక్రవాహనాల దొంగ అరెస్టు

30 బైకుల స్వాధీనం

కదిరి, ఏప్రిల్ 11: పట్టణంలో పలు ద్విక్రవాహనాలను చోరీ చేసిన దొంగను అరెస్టు చేసి, 30 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ పుల్లయ్య తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక రాయచోటి రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూముకుంట గ్రామానికి చెందిన మామిళ్ల వీరారెడ్డి నంబరులేని ద్విచక్రవాహనంపై వచ్చాడన్నారు. అనుమానంతో విచారింగా ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడని, వెంటనే అదుపులోకి తీసుకుని వివరాల మేరకు అతడి వద్ద నుంచి 30 వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కదిరి టౌన్, రూరల్, గాండ్లపెంట, రాయచోటి పట్టణంలో 19 కేసులు అతడిపై నమోదైనట్లు చెప్పారు. నిందితుడిపై గతంలో అనంతపురం, తాడిపత్రిలో కూడా కేసులు నమోదైనట్లు తెలిపారు. వాహనాల విలువ రూ. 15లక్షలు ఉంటుందన్నారు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు వివరించారు. ఈ కేసును చేధించిన ఎస్ఐలు బలరాం, బాబ్‌జాన్, పూర్యానాయక్. శ్రీధర్, సిబ్బంది వేమనారాయణ, శంకర్‌రెడ్డి, రాజప్ప, గోవర్ధన్, చలపతి, వెంకటేశ్‌నాయక్, శివ, రాజేంద్రలను డీఎస్పీ శ్రీలత అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ పుల్లయ్య, స్వాధీనం చేసుకున్న వాహనాలు

బీసీల ద్రోహి వైసీపీ

● మాజీ మంత్రి పరిటాల సునీత



కరపత్రాలను పంచుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

ధర్మవరం, ఏప్రిల్ 11: బీసీల ద్రోహిగా వైసీపీ మిగిలిపోతుందని మాజీ మంత్రిపరిటాలసునీత అన్నారు. కనగానపల్లి మండలంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పర్వతదేవరపల్లి, ముక్తాపురం, మామిళ్లపల్లి గ్రామాల్లో ఆమె ప్రచారం నిర్వహించగా ముక్తాపురంలో జయహోబీసీ సభ నిర్వహించారు. గ్రామానికివచ్చిన పరిటాలసునీతకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ బీసీలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చింది ఒక తెలుగుదేశం పార్టీ మాత్రమేనని స్పష్టంచేశారు. వైసీపీలో కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్‌లను, డైరెక్టర్‌లను నియమించారని కానీ వాటికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. టీడీపీఅధికారంలోకి రాగానే బీసీలకు రూ.4వేలు పింఛన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నెట్టెంవెంకటేశ్, యాతం పోతలయ్య, సుధాకర్‌చౌదరి, బట్టా సురేశ్‌చౌదరి, శంకర్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, దేవరాజు, నారాయణస్వామి, నాగేంద్ర, ముకుందనాయుడు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. గురువారం రామగిరి మండలం కేంద్రానికి చెందిన పూజారి నల్లప్ప, ఆత్మకూరు మండలం పంపనూరు తండాకు చెందిన దేశేనాయక్ వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు.

టీడీపీని గెలిపించుకుందాం: పరిటాల శ్రీరామ్



పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న వైసీపీ నాయకులు

రామగిరి, ఏప్రిల్ 11: టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కొత్తగా వైసీపీ నుంచి పార్టీలో చేరిన వారు సమన్వయంతోపనిచేసి పార్టీని అధిక మెజారిటీతో గెలిపించుకుందామని ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. గురువారం వెంకటాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కనగానపల్లి మండలం తగరకుంట గ్రామానికి చెందిన గంగాధర్, నాగేశ్ తదితరులు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వీరికి పరిటాలశ్రీరామ్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

మామిడి, చీనీ తోటకు నిప్పు



దగ్ధమైన మామిడి తోటను చూపుతున్న రైతు జమ్మన్న దంపతులు

గార్లదిన్నె, ఏప్రిల్ 11: మండలంలోని కల్లూరు సమీపంలో అదే గ్రామానికి చెందిన రైతు ఈభూది జమ్మన్నకు చెందిన చీనీ, మామిడి తోటలకు గుర్తుతెలియన వ్యక్తులు నిప్పు పెట్టారు. సుమారు రూ.5 లక్షలు నష్టం వాటిల్లిన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈభూది జమ్మన్న రైతు 6 ఎకరాల్లో చీనీ, మామిడి, మొక్కజొన్న పంటలు సాగుచేస్తున్నాడు. గురువారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. గమనించిన చుట్టుపక్కల వారు, బాధితులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అప్పటికే తోటలోని పంటలతో పాటు డ్రిప్ సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. రూ. 5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు జమ్మన్న ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రస్తుతం చీనీ, మామిడి, మొక్కజొన్న పంట చేతికొచ్చాయి. ఈ సమయంలో తమపై ఎవరో కక్ష కట్టి నిప్పు పెట్టారని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. జమ్మన్నను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక రైతులు కోరారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి బాధిత రైతులతో వివరాలు సేకరించారు.

విద్యార్థి అదృశ్యం



రేవంత్‌కుమార్

నార్పల, ఏప్రిల్ 11: మండలంలోని కేశేపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఓబుల రేవంత్‌కుమార్ అనే విద్యార్థి 6వ తేదీన అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. గుత్తి మండలంలోని టీ కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓబుల హరికృష్ణ కుమారుడు రేవంత్‌కుమార్ కేశేపల్లి గ్రామంలో బంధువుల ఇంట్లో ఉండి చదువుకుంటున్నాడు. ఇదే గ్రామంలో విద్యార్థి అదృశ్యమైనట్లు తెలిపారు. పలు చోట్ల తల్లిదండ్రులు వెతికినా కనిపించలేదన్నారు. ఆచూకీ తెలిసిన వారు నార్పల పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్ 11: సీకేపల్లి సెబ్ సర్కిల్ పరిధిలోని కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న నలుగురు వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ లలితాదేవి తెలిపారు. పక్కా సమాచారం మేరకు చెన్నేకొత్తపల్లి మండలం ముష్టికోవెల, సుబ్బరాయునిపల్లికి చెందిన నరసింహులు, నాగేంద్రప్రసాద్ ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా ముష్టికోవెల గ్రామ శివారులో వారిని అరెస్టు చేసి ఒక్కొక్కరి వద్ద నుంచి 48 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని రెండు ద్విచక్రవాహనాలను సీజ్ చేశామన్నారు. అలాగే కనగానపల్లి మండల ముత్తువకుంట్ల క్రాస్ వద్ద అదే గ్రామానికి చెందిన రాజు, బాలేపాళ్యంకు చెందిన రామగోవిందు అరెస్టు చేసి వారి నుంచి 720 టెట్రాప్యాకెట్లతోపాటు రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని, నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ పర్యటన



ప్రసన్నాయపల్లిలో పర్యటిస్తున్న ఎస్పీ అమిత్ బర్దర్

రాప్తాడు, ఏప్రిల్ 11: మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ గురువారం సాయంత్రం పర్యటించారు. ప్రసన్నాయపల్లి, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో ఎస్పీ పర్యటించి పోలింగ్ స్టేషన్లు తనిఖీ చేశారు. మౌలిక సదుపాయాలు పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి, రాప్తాడు సీఐ మునిస్వామి పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

అనంతపురం క్రైం, ఏప్రిల్11: నగర వన్‌టౌన్ పోలీసులు ఓ వ్యభిచార గృహంపై దాడి చేశారు. గురువారం సీఐ రెడ్డప్ప సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని ఓ వ్యభిచార గృహంపై దాడులు చేశారు. నిర్వాహకురాలితోపాటు ఓ విటుడు, ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశారు.

పూలే ఆశయ సాధనే టీడీపీ లక్ష్యం: దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11: పూలే ఆశయ సాధనే టీడీపీ లక్ష్యమని అనంతపురం అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. గురువారం పూలే 19వ జయంతిని పురస్కరించుకుని స్థానిక జడ్పీ కార్యాలయం ఆవరణలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ, నగర అధ్యక్షుడు సిమెంట్ పోలన్న, నాయకులు కృష్ణకుమార్, పోతుల లక్ష్మీనరసింహులు, రాయల్ మురళీ, సైపుద్దీన్, గంగవరం బుజ్జి, ఉమర్, ప్రసాద్, మధు, కుమార్, డిష్ ప్రకాష్, గోపాల్, నెట్టెం బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావ్ పూలే జయంతి

అనంతపురం ప్రెస్‌క్లబ్: మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని పురస్కరించుకొని పలువురు కుల, ప్రజా, ఉద్యోగ సంఘాల నాయకులు ఆయన విగ్రహానికి ఘన నివాళులర్పించారు. గురువారం జడ్పీ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, లాలెప్ప, తప్పెట ఓబులేసు, గోవిందు, నాగరాజు, మల్లికార్జున, నరసింహులు పాల్గొన్నారు. అదే విధంగా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా చంద్రమోహన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మోతీలాల్, అనంతసేన, శివరుద్రప్ప, మహేష్, వెంకటస్వామి, ఆవుల చక్రదర్ యాదవ్, కడియాల రామాంజి, విష్ణు, బాలరాజు పాల్గొన్నారు.

విజ్ఞాన దివ్వెగా పూలే

అనంతపురం సెంట్రల్: సమాజానికి చదువునేర్పిన మహాత్మా జ్యోతిరావు పూలే విజ్ఞాన దివ్వెగా వెలుగొందారని జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జేఎన్‌టీయూలో పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రెక్టార్ విజయకుమార్, ప్రొఫెసర్‌లు భానుమూర్తి, సుబ్బారెడ్డి, సత్యనారాయణ, అరుణకాంతి, చంద్రమోహన్‌రెడ్డి, విభాగాధిపతులు అజిత, రామశేఖర్‌రెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు. ప్రజల హక్కులకోసం పోరాటాలుచేసి విజయం సాధించిన జ్యోతిరావు పూలే రచించిన పుస్తకాలను ప్రతి విద్యార్థి చదవాలని ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య కోరారు. వర్సిటీ పూలేభవన్‌లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్‌లు జీవీ రమణ, రవిప్రసాద్, క్రిష్ణకుమారి, విభాగాధిపతులు శ్రీరాములు, సత్యనారాయణ, సోమశేఖర్ పాల్గొన్నారు. అణచివేతను ఎదురించి ప్రజలందరికీ సమాత్వపు స్వేచ్ఛా వాయువును కల్పించిన పూలే అడుగుజాడల్లో నడవాలని ఎమ్మార్పీఎస్ కేబీ మధు సూచించారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

పూలేకు ఘన నివాళి

అనంతపురం విద్య: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని ఫోర్టో రాష్ట్ర ఛైర్మన్ హరికృష్ణ, ఇతర నాయకులు జడ్పీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షులు బీరప్ప, కార్యదర్శి ఉమామహేశ్వర్, ఎస్‌ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షులు ఆదిశేషయ్య, గిరిజన ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రవీంద్ర, డీటీడబ్ల్యూఏ ప్రధానకార్యదర్శి వెంటకేష్, ఆపస్ ప్రధానకార్యదర్శి ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పూలే ఆశయసాధనకు కృషి

అనంతపురం క్లాక్‌టవర్: తొలి సామాజిక ఉద్యమ పితామహుడు, మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయన సాధనకు కృషి చేస్తామని బీసీ సంక్షేమ, ఉద్యోగుల సంఘం నాయకులు అన్నారు. పూలే జయంతి సందర్భంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్తు ఆవరణలోని పూలే విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతా చంద్రమోహన్, ఆవుల చక్రధర్‌యాదవ్, మోతిలాల్, అనంతసేన, శివరుద్రప్ప, మహేష్, వెంకటస్వామి, కడియాల రామాంజి, విష్ణు, బాలరాజు పాల్గొన్నారు.

రామగిరి: బడుగుల ఆశాజ్యోతి మహాత్మాజ్యోతి పూలే జయంతి సందర్భంగా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని శ్రీహరిపురంలో గురువారం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దగ్గుబాటి ప్రసాద్



జేఎన్‌టీయూలో వీసీ శ్రీనివాసరావు...



ఎస్కేయూలో వీసీ హుస్సేన్ రెడ్డి



బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు..



రామగిరిలో..

శింగనమలను అభివృద్ధి చేసి చూపిస్తా

● టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ



రోడ్‌షోలో నమస్కరిస్తున్న శ్రావణి, చిత్రంలో అంబికా తదితరులు

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 11: నియోజకవర్గ ఆడబిడ్డగా వచ్చాను... ఎన్నికల్లో ప్రజలు అదరించి గెలిపిస్తే... శింగనమల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం మండలంలోని వడియంపేటలో నిర్వహించిన రోడ్డుషోలో ఆమెతో పాటు ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడారు. ఐదు సంవత్సరాల పాలనలో ప్రజలు విసిగెత్తిపోయారన్నారు. నియోజకవర్గంలో సహజ వనురుల దోచుకునే వ్యక్తులను ఎన్నుకుంటరా? ప్రజల కోసం పాటుపడే టీడీపీ అభ్యర్థులను ఎన్నుకుంటరా? ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సాకే మురళీకృష్ణ, టీడీపీ ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, కన్వీనర్ అశోక్, కేశన్న, లక్ష్మీనారాయణ, వెంకటేశులు, పరిశే శ్రీనివాసులు, ఎస్ నారాయణస్వామి, పొడరాళ్ల రవీంద్ర, ఓబులపతి, జొన్నారామయ్య, నరేంద్రయాదవ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆలం విస్తృత ప్రచారం

నార్పల: మండలంలోని చాములూరు, నిలువురాయి గ్రామాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి గెలుపునకు టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు గురువారం విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ వైసీపీ ప్రభుత్వ అరాచకాలను వివరిస్తూ బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. జిల్లా నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, ఆకుల అంజనేయులు, పిట్టురంగారెడ్డి, ఎర్రినాగప్ప, జనసేన రామకృష్ణ, జాఫర్,రాజన్న, పీఎల్ లక్ష్మీనారాయణ, ఆలం నాగార్జుననాయుడు పాల్గొన్నారు.



ఆలంకు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు

టీడీపీలోనే మైనార్టీల అభివృద్ధి

శింగనమల, ఏప్రిల్ 11: టీడీపీలోనే ముస్లీం మైనార్టీల అభివృద్ధి సాధ్యమని తెలుగుయవత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు అన్నారు. గురువారం రంజాన్ సందర్భంగా శింగనమల మైనార్టీ ముస్లిం యవత శ్రీనివాసులును కలసి ఈదుముబారక్ తెలిపారు.

జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 11: జిల్లాకు ఎన్నికల అబ్జర్వర్ల రాక దృష్ట్యా జాగ్రత్తగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. అనంతపురం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాట్లను గురువారం కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి లోటు పాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అవసరమైన మరమ్మతులు శాశ్వతంగా ఉండేలా చూడాలని, అతిథి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అబ్జర్వర్ల కోసం ఏర్పాటు చేసిన అధికారుల టీంలు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ స్వరూప్, ఆర్డీఓ వెంకటేష్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుల్‌రెడ్డి, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం రూరల్ ఏప్రిల్ 11: విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ టౌన్-2 డీఈ లక్ష్మీనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రుద్రంపేట సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ కొత్త లైన్ ఏర్పాటు నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదన్నారు. రుద్రంపేట మెయిన్ రోడ్డు సైఫుల్లా కాలనీ, చంద్రబాబు కొట్టాల, చర్చి కాలనీ, విశ్వశాంతి నగర్, పీవీకేకే కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రేపు తిక్కయ్యస్వామి ఉట్ల పరుష

నార్పల,ఏప్రిల్11: మండల కేంద్రంలో శనివారం తిక్కయ్యస్వామి ఉట్ల పరుష నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు సుబ్బయ్య గురువారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తిక్కయ్యస్వామికి ప్రత్యేక పూజలు, ఉట్లమాను ఎక్కుట, చెక్క భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

అంబేడ్కర్ జయంతికి అనుమతి తీసుకోవాలా..?

గార్లదిన్నె, ఏప్రిల్ 11: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు జరుపుకునేందుకు అనుమతులు తీసుకోవాలనడం సిగ్గుచేటని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి మండిపడ్డారు. గురువారం గార్లదిన్నెలో దళిత సంఘాలతో కలసి ఆయన మాట్లాడారు. 14వ తేదీన అంబేడ్కర్ జయంతిని మండలంలోని అన్ని గ్రామాల్లో జరుపుకునేందుకు అనుమతులు తీసుకోవాలని అంక్షలు విధించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎవరెన్ని అంక్షలు విధించినా జయంతి వేడుకలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. జెన్నె ఓబులేసు, రాము, నాగేంద్ర, చిన్నరాముడు, ప్రదీప్, కరుణాకర్, రామకృష్ణ, నారాయణస్వామి, ఓబులేసు పాల్గొన్నారు.

శ్రీరామనవమి ఉత్సవాలను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 11: జిల్లాకేంద్రంలో మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో 17 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కార్యవర్గం పిలుపునిచ్చింది. గురువారం ఆలయ ఆవరణలో ఆలయ అనువంశికుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు వెంకటస్వామి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్‌గౌడ్, సుబ్రహ్మణ్యం, సురేష్‌బాబు చేతులమీదుగా బ్రహ్మోత్సవాల బ్రౌచర్లను ఆవిష్కరించారు. ఆలయ ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, కిశోర్, హర్ష పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 11: ఓటు హక్కు, నమోదుపై యువతకు అవగాహన కల్పించారు. ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మొదట స్థానిక వేణుగోపాల్ నగర్‌లో, కురుగుంటలో ఓటర్స్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు సుంకర రమేష్ మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారుల సూచనల మేరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకుని, ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు. ప్రలోభాలకు గురికాకుండా బాధ్యతగల అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు భరత్, రాజా, నెహ్రూ యువకేంద్రం కార్యకర్తలు నందిత, దివ్యతేజ, సొసైటీ కార్యదర్శి శివ, మహేంద్ర, ధోని పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్

అనంతపురం జిల్లాలో రంజన్ పండుగను ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో ఆచరించారు. నెల రోజులు పాటు కఠోర ఉపవాస దీక్షలు పాటించారు. రంజాన్ ప్రాముఖ్యత గురించి ముతవల్లీలు వివరించారు. పండుగ సందర్భంగా ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



అనంతపురం రూరల్ సిండికేట్ నగర్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శింగనమలలో...



గార్లదిన్నెలో...



రాప్తాడులో...

జడ్పీ మాజీ ఛైర్మన్ నివాసంలో రంజాన్ విందు



దగ్గుబాటి, అంబికాను సన్మానిస్తున్న ఉమర్ ముక్తార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్11: రంజాన్ పండుగను పురస్కరించుకొని జడ్పీ మాజీ ఛైర్మన్ చమన్‌సాబ్ నివాసంలో ఆయన కుమారుడు ఉమర్ ముక్తార్ రంజాన్ విందును ఏర్పాటు చేశారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విందుకు కూటమి అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణ, జనసేన రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులు జయరాంరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు జేఎల్ మురళీధర్, బుగ్గయ్య చౌదరి, రాయల్ మురళీ నేతలను ఆహ్వానించారు. నాయకులు జయరాం నాయుడు, సంగా తేజస్విణి, మధు రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాకర్ చౌదరితో గుమ్మనూరు జయరాం భేటీ



గుమ్మనూరు జయరాంతో మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11: మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరితో గుంతకల్లు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం అనంతపురం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డితో కలిసి గుమ్మనూరు జయరాం ప్రభాకర్ చౌదరితో భేటీ అయ్యారు. తాజా రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం.

మహిళా క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం



క్రికెట్‌లో మెలకువలపై అవగాహన కల్పిస్తున్న కోచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 11: మహిళా క్రికెట్ క్రీడాకారిణుల శిక్షణ శిబిరం ప్రారంభించారు. గురువారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో క్రీడాకారిణులకు శిక్షణ శిబిరాన్ని క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి ప్రారంభించారు. క్రీడాకారిణులకు ఫిట్‌నెస్, ఫీల్డింగ్, బ్యాటింగ్, బౌలింగ్ ఇతర అంశాలపై కోచ్ రమాదేవి అవగాహన కల్పించారు. అసిస్టెంట్ కోచ్ సాగరిక, ఫిజియో బొమ్మన్న, అనురాధ, తేజ, రవికుమార్, యామిని, యుధి, అనిత, హిమబిందు, మేఘనాథ్ పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 11: రంజాన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏఓ క్రిష్ణ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సా యంత్రం 5.30 గంటల నుంచి ధర్మవరం పట్టణానికి చెందిన మానస నృత్య కళా కేంద్రం శిష్య బృందంలో సినీ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. పట్టణ, పుర ప్రజలు విచ్చేసి కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు.

జేఎన్‌టీయూకు 'పంచాయతీ' పొగ..!

● వర్సిటీ ప్రహరీ పక్కనే గ్రామ పంచాయతీ డంప్

● కుప్పలుగా చెత్తాచెదారం ● అక్కడే తగలబెడుతున్న వైనం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 11: వేలాది మంది విద్యార్థులు విద్యనభ్యసించే జేఎన్‌టీయూకి పొగబెడుతున్నారు. వర్సిటీకి, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ మధ్యనున్న ఖాళీస్థలాన్ని గ్రామ పంచాయతీ అధికారులు డంప్‌గా మార్చారు. పంచాయతీ పరిధిలోని చెత్తాచెదరాన్ని ట్రాక్టర్లతో తరలించి కుప్పలు కుప్పలుగా వేసి మంటపెడుతున్నారు. ఈ స్థలం జేఎన్‌టీయూకి చెందిందని అధికారులతోపాటు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయి. అయితే స్థలాన్ని పరిరక్షించుకోవడంలో జేఎన్‌టీయూ యాజమాన్యం గాలికొదిలేయడంతో పంచాయతీ అధికారులు కబ్జాజేశారని వర్సిటీ వర్గాలు, విద్యార్థులు మండిపడుతున్నారు. చెత్త డంప్‌గామార్చి పొగబెడుతున్నారని వాపోతున్నారు. రూ.వందల కోట్లతో నిర్మించిన భవనాలు పొగచూరుతున్నాయని, విద్యార్థులు, అధికారులు, సిబ్బంది పొగతో అనారోగ్యానికి గురవుతున్నారని మండిపడుతున్నారు. ఎకరం రూ.కోట్లలో పలుకుతున్న స్థలాన్ని ఎందుకు పరిరక్షించుకోవడంలేదని ప్రశ్నిస్తున్నారు. వర్సిటీ ఆస్తులను కాపాడుకోవడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పూర్వ విద్యార్థులు మండిపడుతున్నారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించి విద్యార్థుల అవసరాలను తీర్చేవిధంగా వినియోగించు కోవచ్చుకదా అని ప్రశ్నిస్తున్నారు. స్థలాన్ని కాపాడుకోవడంలో వర్సిటీ యాజమాన్యం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.



చెత్తాచెదారాన్ని కుప్పగావేసి మంటపెట్టిన దృశ్యం


గుత్తి ఆర్ఎస్‌లో మత పెద్దల బోధన


ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు(కుందుర్పి)


ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు(కూడేరు)


గుంతకల్లులో ప్రార్థనలు చేయిస్తున్న ప్రభుత్వ ఖాజీ


కణేకల్లులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో రంజాన్

రంజాన్ పండుగను ముస్లింలు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే అయా ప్రాంతాల్లో మసీదుల వద్ద నుంచి ర్యాలీగా ఈద్గా మైదానాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారికి ప్రభుత్వ ఖాజీలు, ముతవల్లిలు, ముస్లిం మత పెద్దలు దైవ సందేశాన్ని వినిపించారు. తర్వాత ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం ఖబరస్తాన్‌కు వెళ్లి తమ పెద్దల సమాధులపై పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థనలు చేశారు. రంజాన్‌ను పురస్కరించుకుని ఇతర మతస్తులు, రాజకీయ నాయకులు, అధికారులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కళ్యాణదుర్గంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు, ఉరవకొండలో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. గుంతకల్లులో గుమ్మనూరు జయరాం, తాడిపత్రిలో జేసీ అస్మిత్‌రెడ్డి ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్.


యాడికిలో ముస్లింల ప్రార్థనలు


పాత ఈద్గా వద్ద ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ, సీఐలు(తాడిపత్రి టౌన్)

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: కాలవ


మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 11: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు రావాలన్నా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని సీతారామాంజనేయస్వామి కల్యాణమంటపంలో జనసేన, బీజేపీ, తెలుగుదేశం పార్టీల నాయకులతో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలన అంతానికి అందరూ సమాయత్తం కావాలన్నారు. రాష్ట్రంలో సైకిల్ గాలి వీస్తోందని ఎన్నికల్లో ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. కార్యక్రమంలో మంజునాథగౌడ్, నాగరాజు, జింక వసుంధరదేవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● నియోజక వర్గం అభివృద్ధి కాలవ శ్రీనివాసులు తోనే సాధ్యమని ఆయన తనయుడు కాలవ భరత్ అన్నారు. మండలంలోని మెచ్చిరి గ్రామంలో గురువారం ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఓటు వేయాలని అభ్యర్థించారు.


ప్రచారం చేస్తున్న కాలవ భరత్

30 కుటుంబాలు టీడీపీలో చేరిక

మండలంలోని కదరంపల్లి గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాల సభ్యులు టీడీపీలో చేరారు. గురువారం ఉదయం టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నివాసంలో కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బొమ్మయ్య, నాగార్జున, ఎర్రిస్వామి, రాజశేఖర్, కృష్ణమూర్తి, ధనుంజయ్య, నాగేంద్ర, రమేష్, రవి, మల్లికార్జున గంగాధర, నాగరాజు, చిన్నమూర్తి హనుమంతు తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయి.

టీడీపీలో చేరిక


పార్టీలో చేరిన వారితో జేసీపీఆర్

తాడిపత్రిటౌన్, ఏప్రిల్11: పట్టణంలోని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసంలో గురువారం యాడికి మండలం చింతలాయపల్లికి చెందిన పలువురు వైసీపీ మద్దతుదారులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి జేసీపీఆర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చిన్నకంబగిరి, రాంమోహన్, కంబగిరిస్వామి, శివశంకర్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి, పిన్నేపల్లి నరసింహులు, కోనుప్పలపాడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా వద్ద ఉద్రిక్తత


నిఖిల్‌నాథ్‌రెడ్డిని నిలువరిస్తున్న పోలీసులు

ఉరవకొండ, ఏప్రిల్11: పట్టణంలోని ఈద్గా వద్ద గురువారం ఉద్రిక్త పరిస్థితి చోటు చేసుకుంది. రంజాన్ పండుగ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి, అతడి సోదరుడి కుమారుడు నిఖిల్‌నాథ్‌రెడ్డి, కుమారుడు అవినాష్‌రెడ్డి వేర్వేరుగా ఈద్గా ప్రార్థనల్లో పాల్గొనేందుకు వచ్చారు. ప్రార్థనల అనంతరం నిఖిల్‌నాథ్‌రెడ్డి వాహనానికి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి వాహనం తగిలింది. దీంతో తమ వాహనానికి ఉద్దేశ్యపూర్వకంగా తగిలించారంటూ మధుసూదన్‌రెడ్డి అనుచరులు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న నిఖిల్‌నాథ్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి వాహనం వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అతన్ని నిలువరించి సర్దిచెప్పారు. నిఖిల్‌నాథ్‌రెడ్డిని అతని వాహనంలోకి ఎక్కించి పంపించారు. దీంతో సమస్య సద్దుమణిగింది. వారందరూ ఒకే కుటుంబానికి చెందిన వారే అయినా సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ ప్రత్యర్థులుగా తలపడుతున్న విషయం తెలిసిందే.

పీర్లచావిడి ప్రారంభం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 11: మండలంలోని వడ్రవన్నూరు గ్రామంలో నిర్మించిన పీర్లచావిడిని గ్రామపెద్దల ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. గ్రామంలో వన్నూరుస్వామికి సంబంధించిన పీర్లచావిడి ని దాదాపు రూ.15 లక్షల చందాలతో నిర్మించారు. కార్యక్రమంలో పురన్న గారి ఆనందేశ్‌గౌడ్, బెణకప్ప గారి గొంచుగారి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌ల ఆర్థిక అభ్యున్నతికి కృషి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 11: టీడీపీ అధికారంలోకి రాగానే వీరశైవ లింగాయత్‌ల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. పట్టణంలోని ఓ కళ్యాణమండపంలో గురువారం వీరశైవ లింగాయత్‌ల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమిలినేని, లింగాయత్‌ల మత గురువు కారథ వీర బసవ మహాస్వామి హాజరయ్యారు. అనంతరం అమిలినేని మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో నివసించే వీరశైవ లింగాయత్‌ల డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.


వీరశైవ లింగాయత్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రబాబు

అమిలినేని కార్యాలయం ప్రారంభం

పట్టణంలోని ప్రజావేదిక వద్ద నూతనంగా నిర్మించిన అమిలినేని సురేంద్ర బాబు నూతన కార్యాలయాన్ని కారదేశ్వర మఠం పీఠాధిపతి నిరంజన్ ప్రణవ స్వరూపి నారద నీరా బసవస్వామి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో అమిలినేని సురేంద్రబాబు బావమరిది రాజగోపాల్, దేవనేని నవీన్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పూలేకు అమిలినేని నివాళి

సంఘ సేవకుడైన మహాత్మా జ్యోతిరావు పూలేకి అమిలినేని సురేంద్రబాబు నివాళులు అర్పించారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద గురువారం పూలే జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

టీడీపీతోనే గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాల అభివృద్ధి

గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలు మెరుగుపడాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని అమిలినేని సురేంద్రబాబు భార్య రమాదేవి, తనయుడు అమిలినేని యశ్వంత్ పేర్కొన్నారు. బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లిలో గురువారం అమిలినేని కుటుంబ సభ్యులు ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు కనీస సౌకర్యాలు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.


ప్రచారంలో అమిలినేని భార్య రమాదేవి, కుటుంబ సభ్యులు


పూలే చిత్రపటం వద్ద అమిలినేని నివాళి

టీడీపీ విజయం తథ్యం

గుంతకల్లు టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 11: ఎక్కడ చూసినా టీడీపీ గెలుపు మాటే వినిపిస్తోందని, రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు తథ్యమని ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని వైనాపురం, ఓబుళాపురం, మొలకలపెంట, గుండాలతండ, దోసలుడికి గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లు టీడీపీకి వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమాలలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, పత్తి హిమబిందు, జనసేన జిల్లా నాయకుడు వాసగిరి మణికంఠ, బీజేపీ నాయకులు పసుపుల హరిహరనాథ్, విశ్వనాథ్, పురందర్ పాల్గొన్నారు.

చేసిందేమీలేదనే వైసీపీని వీడుతున్నారు

ఐదేళ్ల పరిపాలనలో ప్రభుత్వం ఉద్ధరించిందేమీ లేదని వైసీపీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు ఆ పార్టీని వీడుతుండటం ముదావాహ విషయమని గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక టీడీపీ కార్యాలయంలో వైసీపీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలరు కుటుంబాలు టీడీలో చేరాయి. వీరిని గుమ్మనూరు జయరాం పార్టీ కండువాలతో ఆహ్వానించారు. 32వ వార్డు కౌన్సిలరు వై సుధాకర్, 5వ వార్డు కౌన్సిలరు భాస్కర్, 9వ వార్డు కౌన్సిలరు రవి, మాజీ కౌన్సిలర్లు అహ్మద్ బాషా, తాదూరి గోపి, కౌన్సిలరు భర్త ఏపీ రవి, తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ ఇంత మంది ప్రజా ప్రతినిధులు వైసీపీని వీడుతున్నారంటే ఎన్నికల్లో ఆ పార్టీ పరిస్థితి ఏమౌతుందో అర్థమౌతోందన్నారు. టీడీపీని నమ్మి వచ్చిన వారికి తగిన ప్రాధాన్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, కౌన్సిలరు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


జయరాం సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న వైసీపీ కౌన్సిలర్లు

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

పామిడి, ఏప్రిల్ 11: మతిస్థిమితంలేని ఓ యువతిపై ఆమె బంధువే అత్యాచారం చేసిన సంఘటన మండలంలోని ఓ గ్రామంలో గురువారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు... ఓ గ్రామంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న మతిస్థిమితంలేని 20 ఏళ్ల యువతిపై బంధువు మద్యం మత్తులో అత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఈ అఘాయిత్యం జరిగింది. ఈ సంఘటనపై బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

17 నుంచి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


పోస్టర్ విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

కూడేరు, ఏప్రిల్ 11: ప్రసిద్ధి చెందిన జోడులింగాల సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 17 నుంచి 25 తేదీ వరకు జరుగుతాయని ఆలయ అధికారులు గురువారం తెలిపారు. ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు, అధికారులు బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. బ్రహ్మోత్సవాలకు ఆలయంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి: మధు

కూడేరు, ఏప్రిల్ 11: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని ఆపార్టీ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని బ్రహ్మణపల్లి, అరవకూరు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరుగూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలించాలని కోరారు. ఆయనతో వెంట సీపీఐ, సీపీఎం నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.

గుట్టుగా ఖాజీని ఎలా నియమిస్తారు ?

బొమ్మనహాళ్, ఏప్రిల్ 11: గుట్టుచప్పుడు కాకుండా మండలంలోని ముస్లింలకు ఖాజీని ఎలా నియమిస్తారని దర్గాహోన్నూరు గ్రామానికి చెందిన ముస్లిం సంఘం ప్రశ్నించింది. గురువారం సర్మాస్, షఫీ, రజాక్‌సాబ్ ఖాజావలి విలేకరులతో మాట్లాడుతూ కళ్లుహోళ గ్రామానికి చెందిన యూసఫ్‌వలిను ఖాజీగా నియమిస్తూ ఎలా ఉత్తర్వులు ఇస్తారని ప్రశ్నించారు. ఖాజీ మహమ్మద్‌సాబ్ వారి కుటుంబం 450 సంవత్సరాలు నుండి ఖాజీలు కొనసాగుతున్నారని వారిని కాకుండా, ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే యూసఫ్‌వలిని ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. సోమవారం జిల్లా కలెక్టర్‌ను, వక్ఫ్‌బోర్డును కలిసి యూసఫ్‌వలిని కొనసాగించకుండా ఆయనకు ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతామన్నారు. కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ మెంబర్ సర్మాస్‌వలి, మహబూబ్ బాషా, రఫీ, జాకీర్‌సాబ్, బాబా ఫక్రుద్దీన్, సులేమాన్, సైఫుల్లా పాల్గొన్నారు.

విషపురుగు కుట్టి వృద్ధురాలి మృతి

యాడికి, ఏప్రిల్11: విషపురుగు కుట్టి లక్ష్మమ్మ (78) మృతిచెందిన సంఘటన గురువారం గుడిపాడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు యాడికి మండలం గుడిపాడు గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గురువారం తెల్లవారుజామున ఇంటివద్ద విషపురుగు కుట్టినట్లు తెలిపారు. తీవ్ర అస్వస్థతకు గురైన లక్ష్మమ్మను చికిత్స నిమిత్తం తాడిపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మమ్మ మృతిచెందినట్లు తెలిపారు. లక్ష్మమ్మ కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు కవాతు

గుమ్మఘట్ట, ఏప్రిల్ 11: మండలంలోని గుమ్మఘట్ట, తాళ్లకెర, రంగసముద్రం, పూలకుంట, గొల్లపల్లి తదితర సమస్యాత్మక గ్రామాలలో గురువారం సాయంత్రం కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా గ్రామాలలో శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉన్నాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కుందుర్పి, ఏప్రిల్ 11: మండల కేంద్రం సమీప ప్రాంతంలోని పేకాట స్థావరంపై ఎస్ఐ వెంకటస్వామి తన సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మందిని అదుపులోకి తీసుకుని వారి నుండి రూ. 5400ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్తలకు ఆర్థికసాయం

పుట్లూరు, ఏప్రిల్11: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కడవకల్లు, తక్కళ్లపల్లి గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలను ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవ రెడ్డి పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. కడవకల్లు పెద్దయ్య, తక్కళ్లపల్లి గోపాల్‌రెడ్డి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్యక్రమంలో సుదర్శన్‌నాయుడు, శివశంకర్ రెడ్డి, రవిచంద్రనాయుడు, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

పుట్లూరు, ఏప్రిల్11: మండలంలోని కడవకల్లు గ్రామంలో అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు. యల్లనూరు మండలం తిరుమలాపురం గ్రామానికి చెందిన పాలెం కిషోర్‌కుమార్‌రెడ్డి నుంచి 250 మద్యం బాటిళ్లను సీజ్ చేశామని తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.

లిక్కర్ బాటిళ్ల పట్టివేత

పామిడి, ఏప్రిల్ 11: పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి పెద్దమొత్తంలో బాటిళ్లను తరలిస్తుండగా ఎస్‌బీ పోలీసులు దాడులు నిర్వహించి 113 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మద్యం బాటిళ్లను అధిక ధరలకు విక్రయించేందుకు ఆ నలుగురు ప్రయత్నిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. దీంతో స్వాధీనం చేసుకున్న మద్యంను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

ఉరవకొండ, ఏప్రిల్ 11: మండలంలోని ఇంద్రావతి, పెద్దముష్టూరు, కోనాపురం, రాచర్ల, రాచర్ల తండా గ్రామాల్లో ఎమ్మెల్యే తనయులు విక్రమ్‌సింహా, విజయ్‌సింహా వేర్వేరుగా ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో తమ తండ్రి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమాలలో డి.పురుషోత్తం, రేగాటి నాగరాజు, విజయ్‌భాస్కర్, గోవిందు, మాజీ సర్పంచ్ వెంకటేష్, నెట్టింబోస్, సీతారాములు, నరేష్ పాల్గొన్నారు.

ఈడిగ గౌడ కార్యవర్గం ఎన్నిక

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 11: నియోజకవర్గం ఈడిగ గౌడ నూతన కార్యవర్గ సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం పట్టణంలో సమావేశం నిర్వహించి నియోజకవర్గ ఈడిగగౌడ సంఘం అధ్యక్షుడిగా మత్రిస్వామి, ఉపాధ్యక్షులుగా అశోక్‌ని ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఉరవకొండ, ఏప్రిల్ 11: పట్టణంలో బుధవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో లాల్‌కుమార్(27) మృతి చెందాడు. పట్టణశివారులోని పెట్రోల్ బంక్‌లో లాల్‌కుమార్ పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై హోటల్లో భోజనం తెచ్చేందుకు వెళ్లాడు. తిరిగి పెట్రోల్ బంకుకు వెళ్తున్న సమయంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద రోడ్డుకు అడ్డంగా గుర్రం రావడంతో దాన్ని తప్పించే క్రమంలో కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఘనంగా బాట సుంకులమ్మ తిరునాళ్ల



పుట్లూరు, ఏప్రిల్11: మండలంలోని నాయకునిపల్లి గ్రామశివారులో వెలసిన బాట సుంకులమ్మ తిరునాళ్ల గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి మహిళలు గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామికి అభిషేకం చేసి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకొనేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.


గుంతకల్లు ఎస్కేపీ డిగ్రీ కళాశాలలోని పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు


పామిడిలో


ఉరవకొండలో...

పూలేకి ఘన నివాళి

సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని గురువారం పలు ప్రాంతాల్లో ఘనంగా జరుపుకున్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కుల, ప్రజా సంఘాల నాయకులు, విద్యార్థులు, ఉద్యోగులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజనుల ఉద్ధరణ కోసం ఆయన చేసిన కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్.


పూలే జయంతి నిర్వహిస్తున్న దృశ్యం (బ్రహ్మసముద్రం)

సైకిల్ గుర్తుకు ఓటువేయండి

తాడిపత్రిటౌన్, ఏప్రిల్11: వచ్చే ఎన్నికల్లో సైకిల్‌గుర్తుకు ఓటువేసి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డిని గెలిపించాలని టీడీపీ నాయకులు చల్లా సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని జంబులపాడు, చల్లవారిపల్లి, కొండేపల్లి గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సి ఉందని తెలిపారు. ప్రచారంలో ప్రభాకర్‌నాయుడు, వెంకటనాయుడు, జనార్దన్‌నాయుడు, లోకేష్, మహేశ్వర్‌నాయుడు, నాగరంగయ్య లక్ష్మీనారాయణ, హర్షవర్ధన్‌నాయుడు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు